సాక్షి
నల్లగొండ
గురువారం । 5 । డిసెంబర్ । 2024



నష్టపోతున్నాం
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 8లో



హాజరుశాతం ఉండాలి
విద్యార్థుల హాజరుశాతం ఎక్కువగా ఉండాలని ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - 8లో



ప్రచారం చేయొద్దనడం..
పాఠశాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని చేయవద్దనడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు మంత్రి వెంకట్‌రెడ్డి రాక

నల్లగొండ : నల్లగొండకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం రానున్నారు. 7వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా నల్లగొండలో జరిగే సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొంటారు. సీఎం సభ ఏర్పాట్లపై అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేయనున్నారు.

కనగల్, తిప్పర్తికి జూనియర్ కళాశాలలు

నల్లగొండ : జిల్లాలోని తిప్పర్తి, కనగల్ మండలాలకు ప్రభుత్వం జూనియర్ కళాశాలలను మంజూరు చేసింది. ఈ మండలాల్లో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పలుమార్లు మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి చొరవ తీసుకొని ఈ రెండు మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయించారు. దీంతో నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ప్రమోద్‌రెడ్డి



మునుగోడు : యువజన కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా మునుగోడు మండలంలోని ఎల్లగూడెం గ్రామానికి చెందిన మేకల ప్రమోద్‌రెడ్డి ఎన్నికయ్యారు. మూడు నెలల క్రితం యువజన కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించగా ముగ్గురు బరిలో నిలిచారు. అందులో 15వేలకు పైగా మెజార్టీ ఓట్లు సాధించిన ప్రమోద్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ప్రకటించారు. ఈ విషయం తెలిసిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రమోద్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



రాష్ట్ర అధ్యక్షుడి నుంచి నియామక పత్రం అందుకుంటున్న బెల్లి నాగరాజు

రామగిరి(నల్లగొండ) : యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండకు చెందిన బెల్లి నాగరాజు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అల్లి వేణుయాదవ్, పంకజ్‌యాదవ్, కాన్షీరాం, ఎల్‌వీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ




అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్ -2 ప్రారంభానికి ఈనెల 7న సీఎం రేవంత్‌రెడ్డి రానున్నందున పవర్‌ప్లాంట్‌లో చేస్తున్న ఏర్పాట్లను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

భూ ప్రకంపనలు

- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల మూడు సెకన్లపాటు కంపించిన భూమి
- భయభ్రాంతులకు గురైన జనం



నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో బుధవారం భూమి కంపించింది. ఉదయం 7.23 నుంచి 7.30 గంటల మధ్య సుమారు రెండు నుంచి 10 సెకన్ల పాటు భూకంపం రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం లేచి ఎవరి పనులకు వారు సిద్ధమవుతున్న సయయంలో ఒక్కసారిగా భూమి కదిలినట్లు అనిపించింది. ఇళ్లలో సామగ్రి కింద పడటంతో పాటు మంచాలు ఊగినట్లు అనిపించాయి. భూమి కంపించడం గుర్తించిన కొందరు ఇళ్ల నుంచి భయంతో బయటికి పరుగులు తీశారు. ప్రధానంగా నల్లగొండ, నకిరేకల్, చిట్యాల, భూదాన్‌పోచంపల్లి, నూతన్‌కల్, అర్వపల్లి, తిరుమలగిరి, ఆత్మకూర్(ఎం), చౌటుప్పల్, హుజూర్‌నగర్ తదతర ప్రాంతాల్లో ఈ ప్రకంపనలు సంభవించాయి. ప్రకంపనలు చాలా స్వల్పంగా ఉన్నాయని ఇవి రిక్టర్ స్కేల్‌పై నమోదు కాలేదని చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెం వద్ద ఉన్న భూభౌతిక పరిశోధనా సంస్థ(ఎన్‌జీఆర్ఐ) శాస్త్రవేత్త శ్రీనగేష్ చెప్పారు.

ఎఫ్‌సీఐ మేనేజర్‌గా సువీన్‌కుమార్



సువీన్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఏజీఎం

నల్లగొండ : భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఉమ్మడి జిల్లా డివిజన్ మేనేజర్‌గా సువీన్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అరుణాచల్‌ప్రదేశ్ నుంచి వచ్చిన సువీన్ కుమార్‌కు ఎఫ్‌సీఐ ఉద్యోగులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏజీఎం రాఘవేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు సిద్ధం కావాలి

- అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- సీఎం పర్యటించే ప్రాంతాల పరిశీలన



మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనకు అన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి హాజరయ్యే ప్రదేశాలు, అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై ఆయాశాఖ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఎన్జీ కళాశాల, ప్రభుత్వ వైద్య కళాశాలకు వెళ్లారు. రైతు బజార్ వద్ద శంకుస్థాపన చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, నల్లగొండ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 7న మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ద్వారా బ్రాహ్మణ వెల్లెంల చేరుకుంటారని, ముందుగా బ్రాహ్మణవెల్లెంల డెలివరీ ఛానల్‌ను ప్రారంభించి, దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్-2 ప్రారంభోత్సవానికి వెళ్తారని తెలిపారు. అక్కడి నుంచి నల్లగొండ వచ్చి మెడికల్ కళాశాల ప్రారంభం, నర్సింగ్ కళాశాలకు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. ఆ తర్వాత ఎన్జీ కాలేజీ మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాక సందర్భంగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములునాయక్, ఇరిగేషన్ సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.వెల్లెంల ప్రాజెక్టు పరిశీలన



పైలాన్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

నార్కట్‌పల్లి : బ్రాహ్మణ వెల్లెంల - ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సందర్శించారు. రిజర్వాయర్, పంపుహౌస్, పైలాన్, హెలిపాడ్ తదితర ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 7వ తేదీన హెలికాప్టర్ ద్వారా బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారని తెలిపారు. ఎత్తిపోతల డెలివరీ చానల్స్‌ను ప్రారంభిస్తారని అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

కార్యాచరణ ప్రణాళిక పక్కాగా రూపొందించాలి

నల్లగొండ : 2025- 26 సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, రైతు వేదికలు, ప్రభుత్వ సంస్థలకు తాగునీరు అందించే కార్యక్రమాలను ప్రణాళికలో చేర్చేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. 15వ ఆర్థిక సంఘం ఆన్‌టైడ్ నిధులకు సంబంధించి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు, అసంపూర్తిగా మిగిలిపోయిన అంగన్‌వాడీ భవనాల మరమ్మతు, ప్రహరిగోడల నిర్మాణం వంటి పనులు చేపట్టాలన్నారు. అంతకుముందు జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ప్రణాళిక రూపకల్పనకు సంబంధించిన నిబంధనలను వివరించారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లగొండకు రూ.3 వేల కోట్లు ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి

- సీఎంను కలిసి వినతిపత్రం అందజేస్తాం
- జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణ అభివృద్ధి, ఆసుపత్రి, ఏఎమ్మార్పీ కాల్వ లైనింగ్‌కు రూ.3 వేల కోట్లు కేటాయించాలని జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. బుధవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు మంత్రుల చాంబర్ల కమీషన్ ఏజెంట్ల ఆఫీసులుగా మార్చి 12 నుంచి 18 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నిధులను దారి మళ్లించి తాను నిధులు తెచ్చినట్లు మంత్రి కోమటిరెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మంత్రి కోమటిరెడ్డికి దమ్ముంటే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎస్ఎల్‌బీసీ ఏఎమ్మార్పీ కాల్వ, వార్డుల్లో అభివృద్ధి కోసం సీఎం చేత రూ.3 వేల కోట్లు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. తాను ఒక్కసారి గెలిచి రూ.1350 కోట్లు తెచ్చి ఐటీ హబ్, పట్టణంలో రోడ్ల విస్తరణ, జంక్షన్లు, మెడికల్ కాలేజీ, ఎన్జీ కాలేజీ భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి సీఎం చేత నల్లగొండలో ఐటీ కారిడార్ ప్రకటింపజేయాలని డిమాండ్ చేశారు. హరీష్‌రావుపై అక్రమంగా కేసు పెట్టారని, ప్రశ్నిస్తే మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులపై కేసులు పెడుతున్నారని, తాము కేసులకు భయపడబోమన్నారు. సమావేశంలో నాయకులు మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, నిరంజన్‌వలి, బొర్ర సుధాకర్, అభిమన్యు శ్రీనివాస్, లొడంగి గోవర్దన్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మెరుగు గోపి, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు డిప్యుటేషన్ల బెంగ

- ఆరునెలల కిందటే పంచాయతీ కార్యదర్శుల సాధారణ బదిలీ
- ఇప్పుడు మళ్లీ డిప్యుటేషన్‌పై 25 మందికిపైగా ఇతర ప్రాంతాలకు..
- ఇప్పటికే ఆయా జీపీల నిర్వహణకు రూ.లక్షలు వెచ్చించిన కార్యదర్శులు
- తాము ఖర్చు చేసిన మొత్తం వచ్చేదెలా అని ఆందోళన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పంచాయతీ కార్యదర్శులకు డిప్యుటేషన్ గుబులు పట్టుకుంది. పంచాయతీ కార్యదర్శులు ఆ గ్రామంలో పనుల కోసం రూ.లక్షల వరకు అప్పు చేసి ఖర్చు పెట్టారు. ప్రస్తుతం కొందరిని డిప్యుటేషన్‌పై మరో పంచాయతీకి పంపించారు. దీంతో వారు ఆ పంచాయతీలో ఖర్చు పెట్టిన డబ్బుల పరిస్థితి ఏంటన్న ఆందోళనలో పడ్డారు. ఫిబ్రవరిలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అప్పుడు కొత్తగా వచ్చే సర్పంచ్‌లు వారు చేసే పనులకే నిధులను వెచ్చిస్తారు. తాము అదే గ్రామ పంచాయతీలో ఉంటే విడతల వారీగానైనా వెచ్చించిన మొత్తాన్ని వసూలు చేసుకొని అప్పులు తీర్చుకోవచ్చు. వేరే గ్రామ పంచాయతీలో పనిచేస్తూ పాత జీపీ సర్పంచ్ వద్దకు వెళ్లి ఖర్చు చేసిన డబ్బులు వసూలు చేసుకోవడం కష్టమేనని ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీతో ముగిసింది. పంచాయతీల నిర్వహణ బాధ్యత కార్యదర్శులపై పడడంతో పది నెలలుగా వాళ్ల అప్పులు తెచ్చి ఖర్చు చేస్తున్నారు. ఆరు కిందటే పంచాయతీ కార్యదర్శుల సాధారణ బదిలీలు పూర్తయ్యాయి. అప్పుడే తాము ఆయా పంచాయతీల్లో ఖర్చు చేసిన డబ్బుల పరిస్థితి ఏంటని.. ఎవరు ఇస్తారని ఆందోళనకు గురయ్యారు. అప్పట్లో అధికారులు వారికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వ నిధులు వచ్చిన తర్వాత ఎవరికి వారివి ఇస్తారని సర్ది చెప్పారు. దాంతో వారు సమ్మతించారు. ప్రస్తుతం మళ్లీ వారిని డిప్యూటేషన్ల పేరుతో ఇతర పంచాయతీలకు బదిలీ చేస్తున్నారు. దీంతో కార్యదర్శులు ఆందోళనలో పడ్డారు.

కొందరు సొంత ప్రాంతాలకే..

సాధారణ బదిలీలు జరిగి ఆరు నెలలు కాక ముందే ప్రస్తుతం కలెక్టర్ మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులను ఒకచోట నుంచి మరోచోటకు డిప్యుటేషన్‌పై పంపుతున్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా డిప్యుటేషన్లు ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కొందరు కార్యదర్శులు ఆరు నెలల కిందట సాధారణ బదిలీలపై ఇతర మండలాలకు వెళ్లగా ప్రస్తుత డిప్యుటేషన్లలో వారి సొంత ప్రాంతాలకే వస్తున్నారు. దీంతో వారంతా సంతోషంగా ఉన్నారు. కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని దీంతో వారు పెట్టిన డబ్బులురాక.. దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంపై ఆవేదన చెందుతున్నారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మునుగోడులోని జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : పత్తి అమ్ముకునేందుకు వచ్చిన రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. మునుగోడులోని కొంపల్లి జైబింధు జిన్నింగ్ మిల్లులోని సీసీఐ కేంద్రంలో రైతుల పత్తిలో కటింగ్‌చేసి కొనుగోలు చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన ఆయన బుధవారం ఆ మిల్లుని బుధవారం సందర్శించి రైతులు, అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఎమ్మెల్యే వచ్చిన సమయంలో సీసీఐ సిబ్బంది, మార్కెట్ అధికారులు ఆయనకు కనిపించకుండా సంచరిస్తుండగా.. గమనించిన ఎమ్మెల్యే వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. పరిశీలనకు వస్తే ఎందుకు చాటుకు ఉంటున్నావని, రైతులను దోచుకునే హక్కు మీకు ఎవ్వరిచ్చారని ప్రశ్నించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఏ ఒక రైతు పత్తిలో కోత విధించినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన రవి, భీమనపల్లి సైదులు, జాల వెంకన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

నల్లగొండలో బీజేపీ గెలవదు



మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి, పక్కన మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కదు

- మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గంలో బీజేపీ జీవితంలో గెలవదని.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కదని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయం సమీపంలోని మున్సిపల్ పార్కులో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమీ లేదని.. ఒక్క రోడ్డేసి గొప్పలు చెప్పుకుంటున్నాడని విమర్శించారు. బీజేపీ నేతలు నల్లగొండ నియోజకవర్గానికి నుంచి ఎన్ని నిధులు తెచ్చారో చర్చకు సిద్ధం కావాలన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా కోమటిరెడ్డి చేసిన అభివృద్ధే కనిపిస్తుందని.. ఏడాదిలోనే రూ.వేల కోట్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. బ్రాహ్మణవెల్లెంల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు పూర్తవుతున్నాయంటే అది కోమటిరెడ్డి చొరవే అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు అయిన విషయం ప్రజలకు తెలుసన్నారు. బైపాస్‌రోడ్డులో మా భూములు ఉన్నాయని ప్రచారం చేయడంలో వాస్తవం లేదన్నారు. మాకు ఎన్నికలప్పుడే పార్టీలని.. ఆ తర్వాత పార్టీలకతీతంగా పనులు చేస్తామన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి..

ఈ నెల 7న ముఖ్యమంత్రి జిల్లాలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. అనంతరం ఎన్జీ కాలేజీలో నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారని.. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, శ్రీనివాస గౌడ్, పాశం సంపత్‌రెడ్డి, గడ్డం అనూపరెడ్డి, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య



సీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

మిర్యాలగూడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. మిర్యాలగూడలో నిర్వహిస్తున్న సీపీఎం 21వ జిల్లా మహాసభల ముగింపు సభలో ఆయన మట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయ ప్రయోజాల కోసం పాకులాడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. సీపీఎం బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, పోతినేని సుదర్శన్, నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, కందాల ప్రమీల, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాషం, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, లక్ష్మీనారాయణ, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా తుమ్మల వీరారెడ్డి



జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

సీపీఎం జిల్లా నూతన కార్యదర్శిగా తుమ్మల వీరారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడలో జరిగిన జిల్లా మహాసభలో నూతన కమిటీని 41 మందితో ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, కందాల ప్రమీల, సీహెచ్.లక్ష్మీనారాయణ, సయ్యద్ హాషం, వీరేపల్లి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా పి.నర్సిరెడ్డి, గంజి మురళీధర్, మల్లం మహేష్, పి.వరలక్ష్మి, చొగాని సీతారాములు, డి.సత్తయ్య, నన్నూరి వెంకటరమణారెడ్డి, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పెంజర్ల సైదులు, రాచకొండ వెంకన్న, బొజ్జ చిన్నవెంకులు, చలకాని మల్లయ్య, రొండి శ్రీనివాస్, పాదూరి శశిధర్‌రెడ్డి, రెమిడాల పరుశరాములు, ఎం.రవినాయక్, ఎం.వినోద్‌నాయక్, ఎండీ.అయాబ్, కొండేటి శ్రీను, కంబాలపల్లి ఆనంద్, నాంపల్లి చంద్రమౌళి, ఉడుగుండ్ల రాములు, కర్నాటి రమేష్, కొండా అనురాధ, సలీం, జిట్ట సరోజ, రాగిరెడ్డి మంగారెడ్డి, కొండ్రెడ్డ నాగిరెడ్డి, చింతపల్లి బయన్న ఎన్నికయ్యారు.

ముగిసిన సీపీఎం జిల్లా మహాసభలు

మూడు రోజులుగా మిర్యాలగూడ పట్టణంలో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా 21వ మహాసభలు బుధవారం ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ మహాసభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి భవిష్యత్‌లో చేపట్టబోయే ఉద్యమాలను వివరించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి

కట్టంగూర్ : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం కట్టంగూర్ మండలంలోని చెర్వు అన్నారం, కట్టంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 'ఎర్త్ క్లబ్ పుడమి బాల నాయకులు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. ఇంకుడుగుంతల ప్రాముఖ్యత, కంపోస్ట్ ఎరువుల నిర్వహణను వివరించారు. ఇంటి ఆవరణలో రాలిన చెట్ల ఆకులను, చెత్త ఇతర వ్యర్థ పదార్థాలను కంపోస్ట్ పిట్‌లో వేసి ఎరువుగా మారిన తర్వాత కూరగాయల చెట్లకు పంటపొలాలకు వాడుకోవాలని సూచించారు. చెట్లను పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా పాఠశాలల్లో ఎర్త్ క్లబ్ లీడర్లను నియమించి బ్యాడ్జిలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కందాల రమ, కొంక ఆంథోని, ఎస్‌జీఆర్ సంస్థ అడ్మిన్ అనుదీప్, పంతంగి విట్టల్ ఉపాధ్యాయులు ఉన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బీబీనగర్: మండలంలోని చిన్నరావులపల్లి గ్రామ పరిధిలోని ఓ గొర్రెల ఫాంలో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని మాచినేనిపల్లి గ్రామానికి చెందిన మరియమ్మ(40) తన భర్తతో కలిసి బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామ శివారులోని ఓ గొర్రెల ఫాంలో కొంతకాలంగా పనిచేస్తూ అందులోనే నివాసం ఉంటున్నారు. కొద్దిరోజులుగా మరియమ్మ గొర్రెల ఫాంలో కనిపించకపోవడంతో ఫాం నిర్వాహకుడు విష్ణువర్ధన్‌రావు ఐదు రోజుల క్రితం ఆమె భర్తను అడిగాడు. అతడు కూడా మరియమ్మ కనిపించడం లేదని చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మరియమ్మ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం గొర్రెల ఫాంలో వెతకగా మరియమ్మ మృతదేహం అక్కడే తుంగలోని నీటిలో పడి కనిపించింది. మరియమ్మ భర్తతో గొడవ పడి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తుండగా.. మరియమ్మను భర్తే తుంగలో వేసి హత్య చేసినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ..

హుజూర్‌నగర్‌రూరల్: బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన జింకల లింగమ్మ(53) ఈ నెల 2వ తేదీన కూలీ పని నిమిత్తం హుజూర్‌నగర్ పట్టణానికి వచ్చింది. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో.. అదే గ్రామానికి చెందిన పారుపల్లి రమేష్ బైక్ ఎక్కి వెళ్తుండగా.. రమేష్ అతివేగంగా బైక్ నడపడంతో ఆమె బైక్ పైనుంచి కిందపడింది. ఈ ప్రమాదంలో లింగమ్మ తలకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. బ్రెయిన్ డెడ్ అయ్యి బుధవారం మృతిచెందింది. మృతురాలి చిన్న కుమార్తె తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ఎస్‌కే నసీర్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ సమీపంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ పిల్లి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ఎస్‌కే నసీర్ హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. బుధవారం అతడు తన మిత్రుడు నాగభైరవ వీరసీతరామరాజుతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి చిలకలూరిపేటకు బయల్దేరాడు. మార్గమధ్యలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై మిర్యాలగూడ మండలం గుడూరు గ్రామ సమీపంలోని కీర్తి రైస్ మిల్లు వద్ద దామరచర్ల వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ ధీరావత్ నరేష్ ఒక్కసారిగా ఎడమ వైపునకు తిప్పడంతో వీరి కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న నసీర్ కంటికి తీవ్ర గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే అతడు మృతిచెందాడు. అతడి మిత్రుడు వీర సీతరామరాజు క్షేమంగా బయటపడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి అన్న ఎస్‌కే నజీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల హాజరుశాతం ఎక్కువగా ఉండాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ప్రతి కళాశాలలో విద్యార్థుల హాజరుశాతం ఎక్కువగా ఉండాలని వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎంజీయూ ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో వివిధ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని కళాశాలల్లో మౌలిక వసతులు ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించని కళాశాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మారిన సిలబస్‌పై యూనివర్సిటీ పరిధిలో అధ్యాపకులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో అకడమిక్ అడిషనల్ డైరెక్టర్ వై. ప్రశాంతి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, ఆడిట్ సెల్ డిప్యూటీ డైరెక్టర్ సురేష్, జయంతి, అమరేందర్, వివిధ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

తాను చనిపోతూ నలుగురికి ప్రాణదానం



భైరు అంజమ్మ (ఫైల్)

చౌటుప్పల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి మరో నలుగురికి ప్రాణం పోశారు. వివరాలు.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన భైరు అంజమ్మ(65)తన ఇద్దరు కుమారులు సుదర్శన్, కిరణ్‌కుమార్ సంరక్షణలో ఉంటోంది. గత నెల 27న ఆమె ఇంట్లో అకస్మాత్తుగా కిందపడిపోయింది. ఆమెను కుటుంబ సభ్యులు చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. మంగళవారం ఆమె బ్రెయిన్ డెడ్ అయ్యింది. ఆస్పత్రి వైద్యులతో పాటు జీవదాన్ సంస్థ ప్రతినిధులు అవయవదానం గురించి అంజమ్మ కుటుంబ సభ్యులు వివరించగా.. ఆమె కుమారులు అవయవదానం చేసేందుకు ఒప్పుకున్నారు. అవయవదానం చేసిన తర్వాత మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థినికి అస్వస్థత



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

- దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే బాలునాయక్



ఆదర్శ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి (పీఏపల్లి): పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వసతి గృహంలో మంగళవారం రాత్రి ఐదుగురు ఇంటర్ విద్యార్థినులు అస్వస్థతకు గురి కాగా వారిని హుటాహుటిన దేవరకొండకు తరలించారు. ఇదే పాఠశాల వసతి గృహంలో ఉంటున్న మరో ఇంటర్ విద్యార్థిని బుధవారం ఉదయం టిఫిన్ చేసిన అనంతరం అస్వస్థతకు గురికావడంతో హాస్టల్ సిబ్బంది ఆమెను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాఠశాల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు రోజువారీగా అందిస్తున్న భోజనం, వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎమ్మెల్యే వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళి, నాయకులు సిరాజ్‌ఖాన్, ఎల్లయ్యయాదవ్, సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, కాశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సతీష్, కిన్నెర హరికృష్ణ, నారాయణనాయక్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, పరమేష్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ధర్నా..

దుగ్యాలలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వసతి గృహంలో విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం పాఠశాల వద్దకు చేరుకుని గేటు ఎదుట ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

దేవరకొండ: దుగ్యాల మోడల్ స్కూల్ వసతి గృహంలో అస్వస్థతకు గురై దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ వైద్యులకు సూచించారు. బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాలు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్నాం

- ఆర్థికంగా ఆదుకోవాలని ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల డిమాండ్
- తమ డిమాండ్ల సాధన కోసం 7న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు



మిర్యాలగూడ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ప్రకటించిన సమయంలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లను ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ, రాష్ట్ర టాక్సీ క్యాబ్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు బంద్ పాటిస్తూ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. ఒక వైపు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం, మరో వైపు ఓలా, ఉబర్, రాపిడో వంటి కంపెనీలు టూ వీలర్ల ద్వారా ప్రయాణించే అవకాశం కల్పిస్తుండడంతో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు జీవనోపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల డిమాండ్లు ఇవే..

- ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15 వేలు ఇవ్వాలి
- ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొత్త ఆటోలకు పర్మిట్ ఇవ్వాలి
- ఓలా, ఉబర్, రాపిడో కంపెనీలు నడిపిస్తున్న టూ వీలర్లను ట్యాక్సీలను నిషేధించాలి
- ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి
- యాక్సిడెంట్ ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలకు పెంచి, సాధారణ మరణాలకూ వర్తింపచేయాలి
- 50 ఏళ్లు నిండిన ఆటో డ్రైవర్లకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలి
- అక్రమంగా నడుస్తున్న ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఇతర జిల్లా ఆటోలను పర్మిట్ నిబంధనలకు అనుగుణంగా వెంటనే నిషేధించాలి
- కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలి
- ఆటోలకు, క్యాబ్‌లకు పార్కింగ్ స్థలాలు ఇవ్వాలి
- ఓలా, ఉబర్, రాపిడోలను నిషేధించి ప్రభుత్వమే కొత్త యాప్‌ను తీసుకురావాలి
- రాష్ట్ర ప్రభుత్వం టాక్సీ వాహనాలకు యూనిఫామిక్ ఫెయిర్ నిర్ధారణ చేయాలి

కిస్తీలు కూడా కట్టలేకపోతున్నాం



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకం వలన ఆటోలు నడుపుకుని జీవిస్తున్న మాకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. గతంలో రోజుకు డీజిల్ ఖర్చులు పోను కనీసం రూ.600కు పైగా వచ్చేది. కానీ ఇప్పుడు రూ.200 కూడా రావడంలేదు. దీంతో ఫైనాన్స్ కిస్తీలు కట్టేందుకు కూడా ఇబ్బంది అవుతోంది. ఆటోలనే నమ్ముకుని గత ముప్పై ఏళ్లుగా బతుకుతున్న మాకు ప్రభుత్వం నెలకు రూ.12వేలు ఇచ్చి ఆదుకోవాలి.

– పులి వెంకన్న, ఆటో కార్మికుడు, మిర్యాలగూడ

ఉచిత ప్రయాణానికి వ్యతిరేకం కాదు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణానికి మేము వ్యతిరేకం కాదు. అయితే ఆటోలనే జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న మాకు కూడా జీవనోపాధి చూపించాలి. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆటోవాలాలను ఆదుకోవాలి. అధికారంలోకి వచ్చి 12నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకే చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చాం. 7వ తేదీన ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన ఆటో డ్రైవర్లతో నిరసన తెలుపుతాం.

– డి. భీమ్లానాయక్, ఆటో యూనియన్ అధ్యక్షుడు, మిర్యాలగూడ

పాఠశాలల్లో ప్రచారం చేయొద్దనడం సరైంది కాదు

- స్కూళ్లకు ఆటంకం కలిగిస్తున్నారని కలెక్టర్లు మెమోలు ఇస్తున్నారు
- మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నల్లగొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని పాఠశాల్లో చేయవద్దని, బయట ప్రచారం చేసుకోవాలని కలెక్టర్లు చెబుతున్నారని బయట ప్రచారం చేస్తే అందరిని కలవడం సాధ్యం కాదని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి అన్నారు. బోధనకు ఇబ్బంది జరగకుండా మధ్యాహ్న భోజన సమయంలో ప్రచారానికి వెసులుబాటు కల్పించాలని కోరారు. బుధవారం నల్లగొండలోని పీఆర్‌టీయు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నాళ్లుగా పాఠశాలల్లో ప్రచారం చేస్తున్నాం కానీ ఎక్కడ కూడా కలెక్టర్లు, డీఈవోలు ఉపాధ్యాయులకు మెమోలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నల్లగొండ, కరీంనగర్ కలెక్టర్లు మాత్రమే మెమోలు ఇస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. తాము పాఠశాలకు ఆటంకం కలిగించబోమని అన్నారు.

బోగస్ ఓట్లను తిరస్కరించాలి

నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో బోగస్ ఓట్లు ఉన్నాయని, కొన్ని ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో పనిచేయకపోయినా చేసినట్లుగా ఓట్లు నమోదు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో కలెక్టరు, ఎన్నికల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో పీఆర్‌టీయు అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. విలేకరుల సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు డీవీఎస్, ఫణికుమార్, మేకల జాన్‌రెడ్డి,సుంకరి బిక్షంగౌడ్, లక్ష్మణ్, శ్రీనివాస రెడ్డి, అద్దంకి సునిల్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండలో కారు బీభత్సం

- బైక్‌ను ఢీకొట్టిన కిలోమీటరు ఈడ్చుకెళ్లిన డ్రైవర్



కారు ముందు భాగంలో ఇరుక్కుపోయిన బైక్

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలో బుధవారం కారు బీభత్సం సృష్టించింది. పాత బస్తీకి చెందిన హరిప్రసాద్ బుధవారం ఉదయం 7గంటల సమయంలో నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డు నుంచి కారును వేగంగా నడుపుతూ బస్టాండ్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో డీఈఓ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న బైక్‌ను ఢీకొట్టాడు. బైక్ కారు ముందు భాగంలో ఇరుక్కుపోయింది. అయినప్పటికీ హరిప్రసాద్ కారును ఆపకుండా వేగంగా ప్రకాశంబజార్ మీదుగా జిల్లా కోర్టు సముదాయం వరకు ఈడ్చుకెళ్లాడు. కొందరు కారును వెంబడించి కోర్టు సమీపంలో ఆపి పోలీసులకు అప్పగించారు. హరిప్రసాద్ మద్యం మత్తులో కారును వేగంగా నడిపినట్లు వన్ టౌన్ పోలీసులు గుర్తించారు. బైక్‌కు జరిగిన నష్టం చెల్లిస్తానని హరిప్రసాద్ కుటుంబ సభ్యులు అంగీకరించడంతో పోలీసులు హరిప్రసాద్‌ను విడిచిపెట్టారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ చనిపోయిందని బంధువుల ఆరోపణ

నల్లగొండ క్రైం: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మహిళ మృతిచెందిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు బుధవారం నల్లగొండ పట్టణంలోని ఐకాన్ ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. కట్టంగూర్ మండలంలోని కల్మెర గ్రామానికి చెందిన పోషబోయిన లక్ష్మమ్మ(43)కు మంగళవారం రాత్రి ఐకాన్ ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయగా ఆమె మృతిచెందింది. ఆస్పత్రి నిర్వాహకులు అదే రోజు రాత్రి ప్రత్యేక వాహనంలో లక్ష్మమ్మ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. అనుభవం లేని వైద్యులు ఆపరేషన్ చేశారని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు, గ్రామస్తులు బుధవారం ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న నల్లగొండ టూటౌన్ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారికి సర్ది చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలుపగా.. తమ తప్పు ఏమీలేదని ఆస్పత్రి నిర్వాహకులు చెబుతున్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

భువనగిరి: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌లో బుధవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్ పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామానికి చెందిన గరిసె లింగస్వామి(36) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి రాత్రి భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య తెలిపారు. కాగా లింగస్వామి మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సీఎం మాటలు కోటలు దాటుతున్నాయి

- పనులు మాత్రం జరగడం లేదు
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగడంలేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. బుధవారం ఆయన నార్కట్‌పల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏడాది సంబరాలకు ప్రజల నుంచి స్పందన కరువైందని అన్నారు. మహిళ ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం తప్ప మిగిలిన గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందన్నారు. కానీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుపై అక్రమ కేసులు పెట్టడంతో మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి సఫలమయ్యారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డికి పదవి గండం ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ పనులు మాత్రమే చేస్తున్నట్లు వివరించారు. గురుకుల పాఠశాలల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవటం లేదన్నారు. ఈ సమావేశంలో బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కొండూరు శంకర్, మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, యానాల అశోక్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, దోసపాటి విష్ణు, వాజిద్, బోయపల్లి శ్రీను, పనసం వెంకన్న, శ్రీను, నడింపల్లి నరేష్, నర్సింహ, నడింపల్లి మహేష్, మట్టింపల్లి రాజు ఉన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ



సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుల దృశ్యాలు

చిట్యాల: పట్టపగలు ఇంట్లోకి చొరబడి మహిళపై దాడి చేసి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బుధవారం చిట్యాల పట్టణంలో జరిగింది. ఎస్‌ఐ ఎస్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన చేపూరి సత్తిరెడ్డి బుధవారం తన స్నేహితుడి కూమార్తె వివాహానికి వెళ్లగా.. అతడి భార్య ప్రేమలత ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై సత్తిరెడ్డి ఇంటి వద్దకు వచ్చి లోపలిలోకి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ప్రేమలతను బెదిరించి బంగారు ఆభరణాలు, డబ్బులు ఇవ్వాలని కోరారు. ఇంట్లో ఏమీ ఆభరణాలు, డబ్బులు లేవని ఆమె చెప్పడంతో ఆమెపై ఆ ఇద్దరు యువకులు దాడి చేశారు. అనంతరం ఆమె ఒంటిపై గల ఐదు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని బైక్‌పై పరారయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను గుర్తించి వారి సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన యువకులు చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందినవారని సమాచారం.

సెల్ టవర్ ఎక్కి మహిళ ఆత్మహత్యాయత్నం

- భూమి గొడవపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవట్లేదని ఆరోపణ
- న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో దిగివచ్చిన బాధితురాలు



రోదిస్తున్న సత్తమ్మ

నకిరేకల్(శాలిగౌరారం): భూమి గొడవపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవడంలేదంటూ ఓ మహిళ సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసింది. ఈ ఘటన శాలిగౌరారం మండల పరిధిలోని బుధవారం జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన సంకటి పోతయ్య, సత్తయ్య అన్నదమ్ములు. వీరికి 24 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. ఒక్కొక్కరు 12 ఎకరాల చొప్పున పంచుకున్నారు. పోతయ్యకు ఒక్క కుమారుడు, సత్తయ్యకు నలుగురు కుమారులు ఉన్నారు. కొన్నేళ్లుగా ఒకరి భూమిలో నుంచొ మరొకరు వెళ్తూ ఎవరి వ్యవసాయం వారు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో చిన్నచిన్న గొడవలు జరగడంతో పోతయ్య తన భూమిలో నుంచి సత్తయ్యను అతడి భూమిలోకి పోనివ్వడంలేదు. దీంతో ఇరు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సత్తయ్య కుమారులు తనను వ్యవసాయం చేసుకోనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ పోతయ్య శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌లో, డీఐజీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు పట్టించుకోకపోవడంతో పోతయ్య తన భూమిని భైరవునిబండ గ్రామస్తులకు కౌలుకు ఇచ్చాడు. మంగళవారం పోతయ్యకు సంబంధించిన మూడు విద్యుత్ మోటార్ల స్టార్టర్లు, సత్తయ్యకు సంబంధించిన ఒక స్టార్టర్ చోరీకి గురయ్యాయి. దీంతో ఇరువురు పరస్పరం ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో పోలీసులు ఇరు కుటుంబాల సభ్యులను బుధవారం శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఈ క్రమంలో పోతయ్య భార్య సత్తమ్మ తమకు అన్యాయం జరిగినా పోలీసులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ పురుగలమందు డబ్బా తీసుకొని మండల కేంద్రంలోని సెల్‌టవర్ ఎక్కి ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఎంత నచ్చజెప్పినా ఆమె సెల్‌టవర్ దిగిరాలేదు. ఎస్‌ఐ సైదులు సత్తమ్మ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో ఆమె సెల్‌టవర్ దిగి కిందకు వచ్చింది. ఆమెను పోలీసులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ సైదులును వివరణ కోరగా.. భూముల విషయం తమ పరిధిలోనిది కాదని, మోటారు స్టార్టర్లు దొంగిలించారంటూ సత్తయ్య కుమారులపై పోతయ్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు.

బంగారం చోరీ చేసిన నిందితుల అరెస్ట్

చిలుకూరు: బస్సులో ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారం చోరీ చేసిన ఏడుగురిని బుధవారం చిలుకూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిలుకూరు ఎస్‌ఐ సురభి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 10వ తేదీ రాత్రి బస్సులో నల్లగొండ నుండి చిలుకూరు మండలం జానకీనగర్ గ్రామానికి బర్నావత్ వసంత, ఆమె భర్త వీరేష్, పిల్లలతో కలిసి వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు సీతారాంపురం వద్దకు వచ్చిన తర్వాత వసంత తన బ్యాగులో నుంచి 5 తులాల బంగారం(మూడు చైన్లు, రింగులు) చోరీకి గురైనట్లు గుర్తించి అదే రోజు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం చిలుకూరు మండల కేంద్రంలోని కవితా జూనియర్ కళాశాల వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మిర్యాలగూడ నుంచి వస్తున్న బస్సును ఆపారు. అందులో అనుమానాస్పదంగా ఉన్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా.. వసంత బ్యాగులో బంగారం తామే చోరీ చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. వసంత పోగొట్టుకున్న బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలానికి తమ్మిశెట్టి వాణి, గుంజా గిడ్డన్న, మేముల జ్యోతి, మేముల బాల వెంకటస్వామి, వెల్ల చిన్నా, వీరగంధ్ల సరోజనమ్మ కాగా వీరితో పాటు 16 సంవత్సరాల బాలుడు కూడా ఉన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

పోచంపల్లిలో జూదరులు..

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రం శివారులోని శ్రీమిత్ర వెంచర్‌లో బుధవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ కె. భాస్కర్‌రెడ్డి తెలిపారు. పోచంపల్లి మండలం జలాల్‌పురం గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్‌రెడ్డి, పర్వతం సంజీవ, గంజి విఘ్నేశ్‌తో పాటు పోచంపల్లికి చెందిన సామల సుధాకర్‌రెడ్డి, బాలరాజు డబ్బులు పెట్టి పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వారి నుంచి రూ.18వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్‌ఐ వెంట పోలీస్ సిబ్బంది యాదయ్య, రవీందర్, ముత్తయ్య ఉన్నారు.